# అమ్మా! నాకు ప్రాణంతో పుట్టే హక్కు లేదా?

హనుమాయమ్మ అప్పుడే నర్సింగ్‌హోమ్ క్యాంటిన్‌లో పనిచేసి వచ్చి గది తాళం తెరుస్తున్నది.

తెల్లవారకముందు హనుమాయమ్మా ఆమె కూతురు జానకీ గదికి తాళం వేసి బయలుదేరుతారు. కొంత దూరం నడిచిన తరువాత హనుమాయమ్మ దారి రాధానర్సింగ్‌హోము వైపుకు చీలిపోతుంది. జానకి తను నర్సుగా పనిచేసే విజయా నర్సింగ్‌హోము వైపుకు నడుస్తుంది.

అప్పటికి ఒంటిగంట దాటిదింది. హనుమాయమ్మ పొయ్యిదగ్గర పనిచేసి చేసి అలసిపోయివచ్చింది. కనుక తాళం తీసి మంచమ్మీద వాలితేగాని అలసట తీరదు. అలా రోజూ జరుగుతుంది.

ఆమె తాళం పూర్తిగా తెరవకముందే, ఒక మూలుగు, ఆ వెంటనే అమ్మా అన్న కేక వినబడ్డాయి.

ఎక్కడిదీ కేక? ఆమె గుండె అదరినట్లయింది.

తాళము తియ్యకుండానే ఆ పక్కనే ఉన్న ఇంటి కిటికీలోనుంచి తొంగి చూసింది. సౌజన్య అస్తవ్యస్తంగా సోఫామీద పడిఉంది. మూలుగుతూ వెర్రికేకలు పెడుతున్నది. సోఫాలోనుంచి ఆమె దేహం మెల్లగా జారిపోతున్నది కిందికి....

"సౌజన్యా ఏమయిందమ్మా అట్లా బాధపడుతున్నావు? లేచి తలుపు తియ్యగలవా? నేనెట్లా లోపలికి రాను?"

"వచ్చారా పిన్నిగారూ? మెల్లిగాలేచి తీస్తానుండండి" కింద కూర్చుని జరుగుతూవచ్చి తలుపు తీసింది.

ఆమె చేతులు బుజమ్మీద వేసుకుని నడిపించుకుంటూ వచ్చి సోఫామీద పడుకోబెట్టింది హనుమాయమ్మ.

"పిన్నిగారూ, కదిలితేనొప్పి ఎక్కువవుతోంది. కడుపు పిసికినట్టుగా ఉంది. అదేంబాధో నేను చెప్పలేకుండా ఉన్నాను పిన్నిగారూ? పోట్లు పొడుస్తు న్నాయి'' సౌజన్య కడుపు పట్టుకుని మెలికలు తిరుగుతోంది.

"ఎప్పటి నుంచీ"?

సౌజన్యకు ఏడునెలలు ఇంకోవారానికి నిండబోతున్నాయి. ఏడవనెల రాగానే మెటర్నిటీ లీవుపెట్టి తల్లిదగ్గరికి వెళ్ళాలనుకుంది. కాని తొమ్మిదవనెల వెళ్ళితే పురుడొచ్చిన రెండు నెలలవరకూ ఇంట్లో ఉండవచ్చు అనుకుంది. రెండు రోజుల కిందట హరితో వెళ్ళి డాక్టరుచేత పరీక్షచేయించుకుంది. ముందు జాగ్రత్త కోసం ఒక ఇంజక్షను డాక్టరు రాసిఇచ్చింది. మరునాడు హరి ఆమెను మరొక చోట పరీక్ష చేయించాడు. ఆ రోజు పొద్దున విజయానర్సింగ్‌హోములో ఇంజక్షను ఇప్పించి వారంరోజులు సెలవు పెట్టించాడు.

"దానికి సెలవెందుకండీ? రెండునెలలు పోతే మెటర్నిటీ లీవు ఎట్లాగూ పెట్టాలి'' అంది సౌజన్య.

''ఈ ఇంజక్షను బాధపెడుతుంది. నీవు ఆఫీసుకు వెళ్లలేవు, పద. నిన్ను ఇంట్లోదింపి నేను ఆఫీసుకు వెళ్ళాలి''. దింపి వెళ్ళిపోయాడు.

ఆయాసపడుతూ కడుపు గట్టిగా పట్టుకుని చెప్పింది సౌజన్య.

అది ఏ ఇంజక్షనో? హనుమాయమ్మ మనసులో అనుమానం చోటుచేసు కుంది. ఒక ఇంజక్షనుకు వారంరోజులు సెలవుకావాలా? ఆమె దిగ్గునలేచి "నేను ఈపూటకు రానని ఫోనుచేసి చెప్పి, ఒక ఆటో తీసుకువస్తాను. నాకు తెలిసిన సాగర్‌లాల్ నర్సింగ్‌హోముకు తీసుకుపోతాను, నీవేం భయపడకు'' ఐదు నిమి షాలలో వచ్చి ఒక కప్పు హార్లిక్సు సౌజన్యచేత తాగించి, తలుపు తాళంవేసి ఆమెను ఆటోలో ఎక్కించి తీసుకువెళ్ళింది.

పరిక్షచేసిన డాక్టరు ''ఎప్పటినుంచీ ఈ బాధ?'' అడిగింది సౌజన్యను.

"విజయా నర్సింగ్‌హోములో పొద్దున పదిగంటలకు ఇంజక్షను తీసుకుని ఇంటికి వెళ్లానోలేదో కడుపులో బాధ మొదలయింది. లోపల మెలికపెట్టినట్లవు తోంది. లోపల ఉండ తిరిగినట్టు తిరుగుతుంటే ప్రాణంపోతున్నట్టుగా ఉంది. నేను

భరించలేకుండా ఉన్నాను. డాక్టర్ ఈ నొప్పితో నేను బ్రతుకుతానా ?'' ఏడ్చింది.

డాక్టరు విజయా నర్సింగ్‌హోముకు టెలిఫోనుచేసి వివరాలు తెలుసుకుంది వెంటనే.

''నీవు ఆ ఇంజక్షను ఎందుకు తీసుకున్నావు? కావాలనే అడిగావా?''

"ముందు జాగ్రత్తకోసం మావారితో వెళ్ళి తీసుకున్నాను''.

"నీకెంతమంది పిల్లలు?''

"ఇదే మొదటిది డాక్టర్. పెళ్లయి రెండేళ్ళయింది.''

''నీవు చదువుకున్నదానివి. పెళ్ళిచేసుకుని రెండేళ్ళయిందంటున్నావు. ఇప్పుడే బిడ్డ ఒద్దనుకుంటే జాగ్రత్తపడకపోయావా?''

"ఒద్దనుకోవటమేమిటి డాక్టర్? నాకు పిల్లలంటే ఇష్టం. పుట్టబోయే బిడ్డకు స్వెటర్లు అల్లాను. నేప్‌కిన్నులు కుట్టాను. ఇంకాఎన్నో కొని బీరువాలో దాచాను".

"అంత ఇష్టమయితే ఎందుకా ఇంజక్షను తీసుకున్నావు? ముందుగా ఆదేం ఇంజక్షనో అడగలేనంత తెలివితక్కువ దానవా?''

"నాకు తెలియదు డాక్టర్- నాకు తెలియదు'' బిగ్గరగా ఏడ్చింది సౌజన్య.

మాట్లాడుతూనే లోకల్ ఎనిస్థీసియా ఇచ్చి చనిపోయిన బిడ్డను తీసి ట్రేలో పెట్టి సౌజన్యకు నిద్రకోసం ఒక ఇంజక్షను ఇచ్చింది. మూలుగుతూనే సౌజన్య నిద్రలోకి జారుకుంది.

థియేటరు బయట కుర్చీలో కూర్చున్న హనుమాయమ్మను పిలిచి"చూడండి చనిపోయిన బిడ్డ ఆ ట్రేలో ఉంది. నెలలకుతగినట్టుగా పెరిగింది. అబార్షను కోసం విజయా నర్సింగ్ హోములో ఇంజక్షను తీసుకుందట. ఫోనుచేసి కనుక్కున్నాను. కావాలనే ఎబార్షను చేయించుకుంది. ఎందుకయినా మంచిది. ఈ రాత్రికి ఇక్కడే ఉండనియ్యండి. రేపటికి ఎలా ఉంటుందో చూసిగాని ఇంటికి పంపను'' అన్నది డాక్టరు.

"వీళ్లు నేనుండేగదికి పక్కయింట్లో ఉంటారండి. నేను రాధా నర్సింగ్ హోము క్యాంటీనులో పనిచేసి ఒంటిగంటకి ఇంటికి వచ్చేసరికి ఈ సౌజన్య మూలు గుతూ కేకలు పెడుతోంది. నేను లోపలికయినా వెళ్లకుండా వీళ్ళింటికి వెళ్ళి, ఆటోలో తీసుకువచ్చాను. ఎబార్షనుకోసం ఇంజక్షను తీసుకుందా? ఆశ్చర్యంగా ఉంది. భర్త తనకు అల్ట్రాసౌండు పరీక్షట అది చేయించాడని చెప్పిందిగాని ఈ మాట చెప్పలేదు. అయినా వీళ్ళిద్దరికీ పిల్లలంటే చాలా ఇష్టమండీ. రోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పుడు చాకొలెట్లు కొనుక్కొచ్చి చుట్టుపక్కల పిల్లలకు ఇస్తాడు. అంకుల్ అంటూ వాళ్ళంతా చుట్టుకుంటారు. మీరన్నమాటకు నాకేఎంతో ఆశ్చర్యంగా ఉంది. నమ్మలేకుండా ఉన్నాను డాక్టరుగారూ''.

ఆ డాక్టరు అవసరమయితే తప్ప అబార్షను చేయటానికి ఒప్పుకోదు. అల్ట్రా సౌండు పరీక్షచేయించారనగానే తనకు తెలిసిన రెండుమూడు చోట్లకు ఫోనుచేసి "హరి సౌజన్య దంపతులు మీదగ్గరికి వచ్చారా? పరీక్షవల్ల ఏంతేలింది?'' అని అడిగింది.

వాళ్ళిద్దరూ తనదగ్గరికి వచ్చారనీ 'బిడ్డ బాగానే ఎదుగుతోంది. ఆడపిల్ల' అని చెప్పాననీ గిరిధరలాల్ చెప్పాడు.

"చూసారా? వీళ్ళు కడుపులో ఉన్నది ఆడపిల్లా మగపిల్లవాడాఅని తెలుసు కోవటానికి వెళ్లారు. ఆడపిల్ల అనగానే ఈ పనిచేశారు. ఈరోజుల్లోకూడా ఆడపిల్ల అంటే ఇష్టపడనివాళ్ళూ, కడుపులో ఉండగానే అంతంచేయాలని ప్రయత్నంచేసే వాళ్లూ ఉన్నారని నాకు తెలుసు. నాదగ్గరికి వచ్చిన నాలుగో కేసిది."

'ఎంత ఘోరం ఎంత ఘోరం' అంటూ హనుమాయమ్మ బుగ్గలు నొక్కు కున్నది.

"చైనాదేశంలో ఆడపిల్ల పుట్టగానే వేడివేడి నీళ్ళలోముంచి చంపేస్తారు. మనదేశంలో ఆడపిల్లపుడితే మహాలక్ష్మి అంటారు మీవంటి పెద్దవాళ్ళు. అసలు ఆడదే లేకపోతే ఇంక ప్రపంచమేముందండీ"? డాక్టరు తమ పేపర్లోచదివిన విష యాలను జ్ఞాపకంచేసుకుంటోంది. విదేశాలలో ఆడజన్మ వద్దని సెక్సు మార్పించు కుంటున్నారట. ఒకవైపు విజ్ఞానశాస్త్రం పెరుగుతోంది. అది దుర్వినియోగమవు తోంది మరొకవైపు. సీసాలో పెంచినా మరెట్లా పెంచినా స్త్రీలేనిదే సృష్టిఏముంది?

ఏ ప్రాణికయినా జీవించే హక్కు లేదా?

లేదని శాసించేహక్కు ఎవరికున్నది?

నాగరికత వెర్రితలలు వేస్తున్నదా?

హనుమాయమ్మకు డాక్టరు సంగతంతా విపులంగా చెప్తోంది.

ఐదుగంటలు దాటింది. సౌజన్యకు కొద్దినిమిషాలకు ముందే మెలకువ వచ్చింది. డాక్టరు హనుమాయమ్మతో చెప్పినదంతా ఆమె చెవినపడుతునే ఉన్నది. బలవంతంగా కళ్ళు తెరచి నాలుగువైపులా కలయజూసింది.

తను థియేటర్లో బల్లమీద ఉంది. గోడవారగా ట్రేలో ప్రాణంలేని బిడ్డ కనబడ్డది. ఆమెకు కడుపులో దేవినట్లయింది. కన్నార్పకుండా ఆ జీవంలేనిబిడ్డను చూస్తుంటే దుఃఖంపొంగింది.

"అమ్మా నేను ప్రాణంతోపుట్టే హక్కు లేదా ? నేను బతక్కూడదా?'' మూసుకున్న కళ్ళతో పాప అడిగినట్లనిపించింది.

ఆవేశంతో లేచి ఆ ట్రేను గుండెకు అదుముకుంటూ "తల్లీ నీకు బ్రతికే హక్కు లేకపోతే నాకూ లేదు'' అంటూ డాక్టరు దగ్గరికి వచ్చింది సౌజన్య.

''లేచావా? ఈ ట్రే నీవు ముట్టుకోకూడదు అక్కడే పెట్టు. ఆయా వస్తుంది. నీకు ఆడపిల్ల వద్దనేగా ఈ పనిచేశావు? నీ తల్లిదండ్రులే ఈ పని చేసిఉంటే?"

ట్రే అక్కడపెట్టి డాక్టరు కాళ్ళకు చుట్టుకుపోయింది సౌజన్య వెక్కివెక్కి ఏడుస్తూ.

హనుమాయమ్మ ఆ దృశ్యం చూసి కళ్ళను చెంగుతో అద్దుకుంది. ఈ నేరం సౌజన్యది కాదని గ్రహించిన డాక్టరు నిర్విణ్ణురాలయింది.

''కూతురిగా అక్కర్లేని హరికి భార్యగా మాత్రం ఆడది ఎందుకు ? ఆ హంతకుడిని నాకళ్లతో చూడను" సౌజన్య దుఃఖాన్ని ఆపుకోలేకపోతోంది.

''ఇంతటితో అతడిని వదిలిపెడతావా? పిరికితనమనిపించుకుంటుంది అట్లా చేస్తే....అదీగాక అతడు మళ్ళీ ఇట్లా చెయ్యడన్న నమ్మకమేముంది ? నీవు కాక

పోతే మరొక అమ్మాయిని చేసుకుంటాడు. నీకు ఏమాత్రం వివేకమున్నా అతడి తప్పును అతడు తెలుసుకునేటట్టు చెయ్యి: మనిషిని మార్చాలిగాని అంతటితో వదిలిపెడితే ఏం లాభం? ఈ పని మళ్ళీజరుగుతుంది".

''డాక్టర్. ఆయన ముఖం ఎట్లాచూడను? నా వల్లకాదు డాక్టర్ నావల్లకాదు. నా గుండె మండిపోతుంది.'' కళ్ళకు చేతులడ్డంపెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది సౌజన్య. అది ఏడ్పుకాదు, ఆక్రందన.